వసతి గృహ వార్డెన్ సస్పెన్షన్

సాక్షి, హైదరాబాద్/సైదాబాద్: మలక్‌పేటలోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో బాలికపై జరిగిన ఘటన పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతిగృహ వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదేశించడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటనపై తక్షణమే ఉన్నతస్థాయి దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలన్నారు. ఘటనతో సంబంధం ఉన్న వారితో పాటు, విధుల పట్ల అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, బాధితురాలికి సత్వర న్యాయం అందేలా చూడాలన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య హాస్టల్‌ను సందర్శించారు. అక్కడి పరిస్థితి, ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

19 రోజులకు వెలుగులోకి..

ప్రభుత్వ వసతి గృహంలో బాలికపై ఈనెల 6న లైంగిక దాడి జరిగితే విషయం 24న వెలుగులోకి రావడానికి కారణం ఏంటని పలువురు దివ్యాంగ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలికపై లైంగిక దాడి ఘటన గురించి సమాచారం తెలుసుకున్న దివ్యాంగ నాయకులు, అంధ విద్యార్థులు గురువారం బీ–బ్లాక్ క్వార్టర్స్‌లోని అంధ బాలికల వసతి గృహం వద్దకు చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు


అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

నాగోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్నేహపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తపేట డివిజన్‌లోని స్నేహపురికాలనీ, న్యూనాగోలు కాలనీలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు చెత్తా చెదారం బహిరంగ ప్రదేశాలలో వేయకుండా స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో డీవీ రామారావు, సుధాకర్‌రెడ్డి, రమచందర్, ఉమాదేవి, ప్రసాద్, జెంబులయ్య, జీహెచ్‌ఎంసీ, మలేరియా సిబ్బంది సుదర్శన్, చిరంజీవి, వెంకటేష్, శానిటేషన్ సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో అవగాహన కార్యక్రమం ..

దిల్‌సుఖ్‌నగర్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటమాలజీ అధికారులు సూచించారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోమల ద్వారా మలేరియా, మెదడువాపు, ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్‌రెడ్డి, ఎంటమాలజీ విభాగం సిబ్బంది నర్సింహా, రాంబాబు, రాజు, ఎన్టీఆర్‌నగర్ ఫేజ్–2అధ్యక్షులు రవి, కార్యదర్శి నాగరాజు, లక్ష్మణ్, వంగాల శ్రీకాంత్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

'కామినేని'లో ఐవీఎఫ్ డే



మన్సూరాబాద్: జీవనశైలిలో మార్పులు, జన్యుపరమైన ఇతరత్రా కారణాలతో సంతాన లేమి సమస్య ప్రపంచవ్యాప్తంగా పెరుగుతుందని కామినేని ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ వి.హేమలతారెడ్డి అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్‌డే సందర్భంగా కామినేని ఫెర్టిలిటీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐవీఎఫ్ చికిత్సతో సంతానం పొందిన వారి అనుభవాలను ఇతరులకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమలతారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పురుషులు, మహిళల్లో సంతానలేమి సమస్య పెరుగుతుందని, దేశంలో 25 శాతం, తెలంగాణలో 15 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారన్నారు. పురుషుల్లో వీర్యం కౌంట్ తక్కువగా ఉండటం, అసలు లేకపోవడం, కొందరిలో వీర్య కణాల కదలిక చాలా నెమ్మదిగా ఉండటంతో సమస్యలు వస్తున్నాయన్నారు. మహిళల్లో పీసీఓఎస్, హార్మోన్ల అసమతుల్యత, ఊబకాయం, టెస్టోస్టిరన్ స్థాయి పెరగటం, అడినోమయోసిస్ కారణంగా రక్తస్రావం ఏర్పడి అబార్షన్లు జరుగుతున్నాయన్నారు. సంతాన సాఫల్య చికిత్సకు వెళ్లడంతో సమాజంలో చిన్నచూపు ఉంటుందని భయాందోళన చెందవద్దన్నారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిందని, ఐవీఎఫ్ సక్సెస్ 50శాతానికి పెరిగిందని డాక్టర్ సారికా ముదరపు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి


సరితకు జ్ఞాపికను అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రభుత్వ ఉద్యోగులు అభివృద్ధికి కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గత ఆరేళ్లుగా ఎల్‌బీనగర్ జలమండలి డీజీఎంగా పని చేసిన సరిత బదిలీపై మీర్‌పేటకు వెళ్తుండటంతో గురువారం రాజశేఖర్‌రెడ్డి ఆమెను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు బదిలీపై వెళ్లడం సహజమని కాని వారు పని చేసిన ప్రాంత ప్రజల మన్ననలు పొందడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ పవిత్రలక్ష్మీ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, కరుణ్ కుమార్, నరేందర్, ఉమేష్, గౌస్, నరేష్ పాల్గొన్నారు.

ఆక్రమణలు.. అక్రమ పార్కింగ్

• వనస్థలిపురం రైతుబజార్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్ • కుంచించుకుపోతున్న రోడ్లు • రాకపోకలకు ఇబ్బందులు


రోడ్డుపై ఏర్పాటు చేసిన వ్యాపారాల ముందు వాహనాల పార్కింగ్ స్తంభించిన ట్రాఫిక్

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజార్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌరస్తాకు నలువైపులా ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌తో రోడ్డు కుంచించుకుపోయి కనీసం బాటసారులు నడవలేని దుస్థితి నెలకొంది. ఈ కూడలిలో నుంచే వనస్థలిపురం, సాహెబ్‌నగర్, హయత్‌నగర్, విజయవాడ జాతీయ రహదారి సుష్మా చౌరస్తా వైపు నిత్యం వేలాది మంది వాహనదారులు తమ కాలనీల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కూడలిలో ఓ వైపు పెట్రోల్‌బంక్, మరో వైపు వివిధ దుకాణాలు, ఇంకోవైపు రోడ్డు మీదకు వచ్చిన పూలు, పండ్ల వ్యాపారాలు ఆటోల పార్కింగ్ స్టాండ్ ఉన్నాయి. ఆయా దుకాణాల వచ్చేవారు తమ వాహనాలను ఏకంగా రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఎక్కడికక్కడ వాహనాలు స్తంభించిపోతున్నాయి.

కానరాని ట్రాఫిక్ సిబ్బంది..

ట్రాఫిక్ నియంత్రణకు ఇక్కడ సరైన ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో నలువైపులా నుంచి వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నారు. గతంలో ఈ సమస్యపై పలుమార్లు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి ఆ తర్వాత ఇటు ఏం జరుగుతుందో అని కన్నెత్తి చూడలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పైకి వస్తున్న ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లను తొలగించడానికి ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ రైతుబజార్ కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


వనస్థలిపురం రైతు బజారు కూడలిలో ఏర్పడిన ట్రాఫిక్‌జామ్

ఆక్రమణలను తొలగించాలి..



రైతుబజార్ కూడలిలో రోడ్లపై ఏర్పాటు చేస్తున్న వ్యాపారాలతోనే ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడూ కమలానగర్ వైపు టర్నింగ్‌లో ఉన్న పెట్రోల్‌బంక్ నిర్మాణం రోడ్డు వరకు విస్తరించడంతో వాహనాలు స్తంభించిపోతున్నాయి. బంక్ నిర్వాహకులు రహదారికి కొంత స్థలం వదిలితే సమస్య తీవ్రత తగ్గుతుంది. రైతుబజార్ ముందు ఉన్న ఆక్రమణలను తొలగిస్తే వాహనాల పార్కింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

– నర్సింహారావు, శారదానగర్

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు – టమాట రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ.35, బీర రూ.35, క్యాబేజీ రూ.20, ఫ్రెంచిబీన్స్ రూ.70, క్యారెట్ రూ.42, దొండ రూ.28–30, చిక్కుడు రూ.65, గోకర రూ.35, బీట్‌రూట్ రూ.32, క్యాప్సికం రూ.47, ఆలు రూ.40, దోస రూ.18, సొర రూ.09, పొట్ల రూ.13, ఉల్లిగడ్డ రూ.39, చామగడ్డ రూ.40. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మూసారంబాగ్‌లో అధికారుల పర్యటన



మలక్‌పేట: అంబేద్కర్‌బస్తీ, ఫ్రెండ్స్‌కాలనీ, వడ్డెర బస్తీ, వాంబే కాలనీల్లో గురువారం నీటి నాణ్యత అధికారుల బృందం పర్యటిస్తూ తాగునీటిని పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిలో క్రిమికీటకాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుండటంతో వాటర్ క్వాలిటీ మానిటరింగ్ చేశారు. ఆయా బస్తీ, కాలనీల వాసులకు క్లోరిన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేసి వాటిని వేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ క్వాలిటీ డీజీఎం శ్రీనివాస్, మూసారంబాగ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ అహ్మద్ షాషా, శివరామ్, బీజేపీ నేత బొక్క మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న మేస్త్రీపై కేసు

చంచల్‌గూడ: బాలుడిని పని పెట్టుకున్న మేస్త్రీపై కేసు నమోదైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సైదాబాద్ క్రాస్‌రోడ్డులోని నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో కర్నూల్‌కు చెందిన ఓ బాలుడు (16) కూలిగా పని చేస్తున్నట్లు ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని పనిలో నుంచి తొలగించి మేస్త్రీ రాంబాబుపై కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తపేట్ డివిజన్ పరిధిలో గతంలో వేసి రోడ్లు వర్షాలకు ధ్వంసమయ్యాయని డ్రైనేజీ లైన్ కోసం గుంతలు తీసి మరమ్మతులు చేయలేదన్నారు. రోడ్లన్నీ బురదగా మారాయని వెంటనే నూతన సీసీ రోడ్ల నిర్మాణాలను చొరవ చూపాలని వినతిలో కోరారు. అనంతరం ఆర్టీసీ కాలనీలో పర్యటించి డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని జలమండలి డీజీఎం రవీందర్ శర్మకు సూచించారు. కాలనీలో విద్యుత్ దీపాలు, శానిటేషన్, మంచి నీటి సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట జలమండలి ఇన్‌చార్జి ఆరీఫ్, దయాకర్, కాలనీ అధ్యక్షులు పెంటరెడ్డి, యాదగిరి, శ్రీనాథ్ ఉన్నారు.

రేపు కంఠమేశ్వరస్వామి ఆలయం వద్ద బోనాలు


శ్రీధర్‌గౌడ్

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లోని కంఠమేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 27న బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాతూర శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ హాజరవుతారన్నారు.

దుర్గా పోచమ్మ ఆలయంలో 28న..

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి ఎస్‌కేడీనగర్ చౌరస్తా సమీపంలోని దుర్గా పోచమ్మ దేవాలయంలో ఈ నెల 28న బోనాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ముద్దగోని శేఖర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 5 గంటలకు అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మహానైవేద్యం, మంగళహారతి, రాత్రి 9.30 గంటలకు బలిహరణ ఉంటుందన్నారు. సాహెబ్‌నగర్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఫలహార బండి ఊరేగింపు ప్రారంభమై ఆలయానికి చేరుకుంటుందన్నారు.

చిన్నారులకు 'జేఈ' వ్యాక్సిన్ వేయించాలి


విద్యార్థులకు టీకా వేస్తున్న వైద్యులు


చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

మలక్‌పేట: ఆరోగ్య సంరక్షణ కోసం 09–15 వయసున్న పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేయించాలని శాలివాహననగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరుణ్ అన్నారు. గురువారం శాలివాహననగర్, బాగ్‌మూసారిమో పాఠశాలలోని పిల్లలకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరస్ సోకకుండా, మెదడు వాపు లాంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా ఈ వ్యాక్సిన్ పిల్లలకు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శశికళ, వైద్యసిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఎల్‌బీనగర్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు జపనీస్ ఎన్సెఫాలిటీస్(జేఈ) వ్యాక్సిన్ వేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 9 నెలల నుంచి 15 సంవత్సరాలు లోపు వారు ఈ టీకాను వేసుకోవాలని తద్వారా రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, ప్రధానోపాధ్యాయులు దినేష్, రాబూకృష్ణ, నాయకులు రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కథనాలతో కదిలిన యంత్రాంగం


రాఘవేంద్ర కాలనీలో వేలాడుతున్న కేబుళ్లను తొలగించిన దృశ్యం

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుళ్లతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడేది. ఈ సమస్యలపై ఈ నెల 23న 'గుబులు పుట్టిస్తున్న కేబుళ్లు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఏడీఈ రాజేందర్, ఏఈ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుళ్లను తొలగింపజేశారు. అనుమతి ఉన్న కేబుల్ సంస్థలకు మూడ్రోజుల్లో ప్రమాదకరంగా మారిన కేబుళ్లను తొలగించి, మిగతావాటిని విద్యుత్ అంతరాయం లేకుండా సరి చేసుకోవాలన్నారు. నింబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. కొన్ని కాలనీలలో కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటి గుర్తించి త్వరలో వాటి స్థానంలో సిమెంట్ స్తంభాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లోకి అధికారి.. విడుదలైన జీతాలు..

చాదర్‌ఘాట్: అధికారి ఉద్యోగ విరమణ చేయడంతో వేరే అధికారిని నియమించకపోవడంతో మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. సిబ్బంది సమస్యలపై ఈ నెల 16న 'అధికారి లేక..జీతాలు రాక' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తాత్కాలిక పర్సన్ ఇన్‌చార్జిగా రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పద్మహర్షను నియమించగా గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అధికారి రాకతో ఉద్యోగుల జీతాలు విడుదల కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.


గుబులు పుట్టిస్తున్న కేబుళ్లు

సాక్షిలో ప్రచురితమైన కథనం

పని చేస్తున్న పాఠశాలకే కన్నం

• రూ.6.79 లక్షలు ఎత్తుకెళ్లిన సెక్యూరిటీగార్డు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఐ అశోక్ కుమార్

హస్తినాపురం: పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ అదే పాఠశాలలో నగదును ఎత్తుకెళ్లిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం డీఐ అశోక్‌కుమార్ వివరాల ప్రకారం.. వైదేహినగర్‌లోని నారాయణ స్కూల్‌లో బిహార్‌కు చెందిన మిత్లేష్‌కుమార్(29) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గతనెల 12న స్కూల్‌లో ఎవరూ లేని సమయంలో అల్మారాలోని రూ.6.79 లక్షల నగదును తీసుకొని పారిపోయాడు. ఇన్‌చార్జి రఘునాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బిహార్ రాష్ట్రంలోని సహజాని, భోజ్‌పూర్ హసన్‌బజార్‌లో ఉన్న మిత్లేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్దనున్న రూ. 6.20 లక్షలను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించామన్నారు.

గుండె వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

చాదర్‌ఘాట్: కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన లభించిందని హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం చాదర్‌ఘాట్‌లోని కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన శిబిరంలో 120 మంది పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. డాక్టర్ శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చక్కటి ఆహార నియమాలు పాటిస్తే గుండె సంబంధిత సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరరాజు, ప్రమోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలకు రావాలని డీసీపీకి ఆహ్వానం


డీసీపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో బస్తీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే బోనాల జాతరలో పాల్గొనాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ సుభాష్ కంతిలాల్‌కు బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ తంగెళ్ల సుధీర్ గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. గత కొన్ని ఏళ్లుగా పోలీసు శాఖ మాదన్నపేట నల్లపోచమ్మ దేవాలయానికి పట్టువస్త్రాలు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుందని డీసీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో బాబురావు, శ్రీకాంత్, ప్రేమ్‌కుమార్, జనపాల మధు పాల్గొన్నారు.

ఫతుల్లాగూడ చెరువు సర్వే


చెరువు సర్వేకు వచ్చిన అధికారులు

నాగోలు: ఉప్పల్, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల పరిధిలోని బండ్లగూడ ఫతుల్లాగూడ చెరువును గురువారం అధికారులు హద్దులు గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఫతుల్లాగూడ చెరువు ఆక్రమణలపై స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా గత శుక్రవారం చెరువును స్వయంగా పరిశీలించారు. సర్వే చేయాలని ఆదేశించడంతో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలను గుర్తించేందుకు సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నాగరాజు, అబ్దుల్లాపూర్‌మెట్ ఆర్ఐ భిక్షపతి పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న గోదాం దాడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుల బస్తాలు

నాగోలు: రైతులకు నకిలీ పురుగుల మందులను విక్రయిస్తున్న గోదాంపై దాడి చేసి ముఠాలోని ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా, గుండారంకు చెందిన ఎలిగందుల రాజేష్ ఎల్‌బీనగర్ బైరామల్‌గూడ, సీతారామనగర్ కాలనీలో క్రిమిసంహారక మందుల గోదాం నిర్వహిస్తున్నాడు. ఇతడికి హరియాణకు చెందిన అంకిత్, లక్నోకు చెందిన జయరామ్, గౌరవ్, జైపూర్‌కు చెందిన సింగ్ పరిచయమయ్యారు. వారి నుంచి నకిలీ పురుగుల మందులను తీసుకొచ్చి తన గోదాంలో ఉంచి రైతులకు వివిధ పేర్లతో విక్రయిస్తున్నాడు. వ్యవసాయ అధికారి ఆకుల సకలేష్ ఇచ్చిన సమాచారం మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు గురువారం రాజేష్ గోదాంపై దాడి చేసి నకిలీమందులు, బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌ను రిమాండ్‌కు తరలించామని మిగతా వారిని త్వరలో అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

వెంటపడుతున్నాయ్!



హస్తినాపురం డివిజన్ పరిధి నందనవనం కాలనీ, వాంబేకాలనీ, ఆదర్శ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాలలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఎల్‌బీనగర్ సర్కిల్ వెటర్నరీ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్వంతోనే వీధి కుక్కలు విజృంభిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. –హస్తినాపురం